# జీవన న్యాయం

ఆకాశంలో విచ్చలవిడిగా మబ్బు తునకలు పరుగెడుతున్నాయి. ఆఫీసునుంచి వస్తూనే కాళ్ళూ, చేతులూ, ముఖం కడుక్కొని డాబామీద ఈజీ చెయిర్‌లో కూర్చున్నాను. అలా ఒక అరగంటసేపు విశ్రాంతిగా కూర్చుంటే ఆఫీసులో రోజంతా పనితో సతమతమయ్యే నాకు కొంత ఉపశాంతి కలుగుతుంది. ఇలాంటి సమయాల్లోనే నా ఆలోచనలు ఒక పరిధిలో చేరి కథావస్తువు దొరకడం అసత్యం కాదు. అయితే సరిగ్గా అయిదు గంటలకు ఆఫీసునుంచి నాకు ముక్తి దొరకడం అరుదు. చేసేది చిన్న గుమాస్తా ఉద్యోగమైనా, నామీద చాలా బరువు బాధ్యతలున్నాయి. తరచు చాలా రాత్రయ్యేవరకు ఫైళ్ళతో కుస్తీ పడుతూ ఉండాల్సి వస్తుంది. అదేం ఖర్మమోకాని, ఒళ్ళు దాచుకోకుండా పనిచేసే వాళ్ళ నెత్తిని మరింత పని రుద్దాలని అధికారులు అనుకోవడం, నాలాంటి వాళ్ళు నలిగిపోవడం ఈనాటి సమాజ వ్యవస్థలో పాతుకుపోయింది. నా మానసాకాశంలో ఆలోచనలు గగనంలో మబ్బుతునకల్లా పరుగులెడుతున్నాయి. ఇంతలో ఆరేళ్ళ ఇందిర శుభ్రంగా ముస్తాబై గాలిపటంతో డాబామీద కొచ్చి దాన్ని ఎగరవేయటానికి ప్రయత్నిస్తోంది. గాలిపటాన్ని ఎగరవేసే మెలకువలు తెలియక అది తికమక పడుతోంది. గాలిపటం మెలికలు తిరిగి డాబా పిట్టగోడలకు గుద్దుకుంటున్నది. నాకు పాప పడేపాట్లు చూస్తే ఒక మూల జాలి, ఒక మూల నవ్వు వస్తున్నాయి.

మబ్బులు క్రమక్రమంగా దట్టమై ఆకాశాన్ని కప్పివేశాయి. వెలుతురు మెల్లగా సన్నగిల్లింది. మబ్బులకు తోడు మలయమారుతం జతకావడంతో భారీవర్షం వచ్చే సూచనలు కనిపించాయి.

'నాన్నా! ఈ గాలిపటం ఎగరటం లేదు. ఇంకొంచెం పెద్దది తీసుకురా" అంటూ గునుస్తూ నా చెంత చేరింది ఇందిర.

"అలాగే. తల్లీ! రేపు తప్పక తీసుకువస్తాను. వానవస్తోంది. కిందకు పోదాం, పద" అని ఇందిరతోపాటు కిందికి దిగాను.

నేను గదిలోకి రావటం గమనించి రాధ పొరుగింటినుంచి వచ్చింది.

"ఈ సంగతి విన్నారా? బాబూరావు భార్యమీద కోపంతో సముద్రంలో దూకి చస్తాను కాని ఈ కొంపలో తిరిగి అడుగుపెట్టనని శపథం చేసి వెళ్ళిపోయాడట. ఇంతవరకు ఇంటికి రాలేదు, పాపం! నళిని ఆందోళన పడుతోంది" అంది.

బాబూరావు మేము ఉంటున్న లోగిట్లోనే ఉంటున్నాడు. రెండేళ్ళ క్రితమే పెళ్ళైంది. ఆరు నెలల కొడుకు ఉన్నాడు. నాకు ఈ వార్త వజ్రాఘాతంలా తగిలింది.

"ఎందుకు అలా చేసి ఉంటాడు - ఇంతకీ ఏమిటి కథ?" అన్నాను. నాలోని కధకుడు కథావస్తువు కోసం ఉత్సుకత చూపుతున్నాడు. నా భావాన్ని ఎంతచక్కగా పసికట్టిందో కాని, రాధకు నా ప్రశ్న సాధారణమైనదైనా, చిరుకోపాన్ని కలిగించింది.

"పాపం! నళిని తన పసుపు కుంకుమకు ముప్పు వాటిల్లిందని ఏడుస్తూంటే వాళ్ళమీద కథ రాయాలని ఉబలాడపడుతున్నారు. బాగుంది. ఛీ! ఏం మనస్తత్వం మీది? ఇకమీదట ఇరుగుపొరుగుమీద కథలు రాస్తే నామీద ఒట్టే!" అంది.

రాధ కుశాగ్రబుద్ధికి ఆశ్చర్యపోయాను. "నా ఉద్దేశ్యం అది కాదు" అన్నాను తడబడుతూ.

"మరే! మాటలు మార్చేయకండి. ఇంతకుముందు ఇలాగే ఇరుగుపొరుగుల విషయాలు ఆరాతీసి కథలు రాయలేదా? పత్రికలకు పంపలేదా?"

రాధ అన్న మాటలో అసత్యం ఆవంతైనా లేదు. ఒక్కొక్కప్పుడు కథావస్తువుకోసం నేను ఎంత బుర్ర బద్ధలు కొట్టుకున్నా తట్టదు. అలాంటి సమయాల్లో రాధ పుణ్యమా అని మంచి ప్లాట్సు నా బుర్రకు తడతాయి. తీరిక సమయాల్లో ఇరుగుపొరుగులతో ముచ్చట్లు సల్పి, ఏమైనా విశేషాలుంటే నా చెవిని వేయటంపరిపాటి. నేటి పత్రికల్లో పడే కథలకు కావలసిన ముడిసరుకు సామాన్య గృహాల్లో జరిగే నిత్యసంఘటనలు ఆధారంగానే లభ్యమయ్యేది. వాటికి కొసమెరుపులు దిద్ది, చక్కనిశైలిలో రాయడం -కొంత ఊహాగానంచేసి కథను మలుపులు తిప్పడమేగా నేను చేసేది. బాబూరావు ఆత్మహత్యకు దారి తీసిన కారణాలు అవగాహనమైతే నా మెదడుకు, నా కలానికి ఈ రాత్రి కావలసినంత పని. అందు లోను ఉప్పెనలా వర్షం ముంచుకొచ్చింది. కాని రాధను చూస్తే ఆమె నాతో సహకరించేలా లేదు.

రాత్రి భోజనాల దగ్గర కూడా రాధ నోటిలోంచి ఆవగింజంత విషయం బయటకు లాగలేక పోయాను. ఎవరన్నారో - "ఆడదాని నోటిలో నువ్వుగింజ కూడా నానదని" వాళ్ళేకాని నాకు ఎదురైతే రాధముందు నిల్చోపెట్టి మీరు చెప్పిన సూక్తి తప్పు, ఇప్పటికైనా దిద్దుకోండి అనేవాడిని.

అయినా నేను నిరాశ పడలేదు. నళిని, బాబూరావుల దాంపత్యం గురించి రాధ లోగడ చెప్పిన విషయాలు జ్ఞప్తికి తెచ్చుకోవడం మొదలుపెట్టాను.

★ ★ ★

కొత్తగా పెళ్ళైన ఆ భార్యాభర్తలు అన్యోన్యంగా తిరిగింది ఆరునెలలే. ఆ తరువాత ఆ గృహంలో చినికిచినికి గాలివానలు, చిరుతుఫానులు మొదలయ్యాయి. శాంత బాల్యం భోగభాగ్యాలతో మూడు పువ్వులు ఆరు కాయలుగా గడిచింది. అయితే తండ్రి హఠాన్మరణంతో ఆ కుటుంబం చితికి పోయింది. ఆమె కన్న కలలు, ఆశలు అన్ని నరసింహాల్ని పెళ్ళిచేసుకోవడంతో కల్లలే అయ్యాయి. మొదట ఆమె ఈ వివాహానికి ప్రతిఘటించింది. తల్లి తన అసమర్థతను తెలియజేయటం, అన్న నిరసన చూపుతో ఆమె చేసిన ప్రయత్నాలన్ని విఫలమై పరిస్థితులకు రాజీ అయి నరసింహంచేత తాళి కట్టించుకుంది. ఒక పెద్ద మేడ, కారు, ఒంటినిండా సొమ్ములు, ఇంటినిండా దాసదాసీ జనం - తన జీవితం నందనోద్యానవనంలో హంసతూలికాతల్పం మీద కాలుమీద కాలువేసుకుని గడపాలని ఆశించిన ఆమెకు

ఈ పేద నరసింహంతో ముడిపడడంతో జీవితంమీద నిరాశ, నిస్పృహలు జనించాయి. దాసీలు లేరు. వంట సహితం తనే చెయ్యాలి. కారులేదు సరికదా – కాలినడకను షికార్లు కూడా కరువయ్యాయి. దాంతో ఆమెకు నరసింహం చులకనయ్యాడు. చీటికి మాటికి భర్తను సాధించడం, ఉన్నదానికి లేని దానికి భర్తమీద విసుక్కోవడం ఆమెకు పరిపాటైంది. శాంతకు వంటింటి కుందేలులా బ్రతకడం సుతరామూ ఇష్టంలేదు.

నరసింహం మెత్తని మనిషి. నా అన్నవాళ్ళు లేరు. భార్య సూటిపోటి మాటలకు తట్టుకుంటూ, ఆమెతో రాజీపడుతూ, ఏ కలహమూ, పెనుతుఫాను కాకుండా చాలా జాగ్రత్తగా మసలుకునే మనస్తత్వం అతనిది. ఒక్కచేతితో చప్పట్లు చరచడం సాధ్యంకాదని, తను ఆమె కలహాల్లో సహరించకపోతే జీవనం సాఫీగా నడిచి పోతుందని ఆశించే తత్వం. తను మాటకు మాట కలిపితే అది అగ్నికి ఆజ్యంలా పని చేస్తుందని ఊహించి ఓరిమితో, శాంతలో మార్పుకి ఆశించి జీవించే తత్త్వం అతనిది. ఈవిధంగా ఈ దంపతులమధ్య ఒక సంవత్సరం గిర్రున తిరిగింది.

భర్త మరీమెత్తగా ఉంటూ ఉండడంతో శాంత మరింత విజృంభించేది. మొదట్లో పావలా మల్లెపువ్వులకోసం వేధించేది. తరువాత తరువాత మల్లెపువ్వులాంటి చీరలకోసం సాధించడం మొదలెట్టింది. చల్లగాలిలో సాయంత్రాలు షికారుకి వెళ్ళడంతో సంబరపడే ఆమె రానురాను సినిమాలు, వినోద కార్యక్రమాలకోసం భర్తను ప్రేరేపించేది. మధ్యతరగతి మనిషి నరసింహం – ఆమె చపలత్వానికి హద్దులు లేకపోవడంతో దీనంగా తనలో తనే కుమిలిపోయేవాడు. ఓరిమికి మరోపేరు నరసింహం అన్న అతనిలో క్రమేపి మార్పు రాసాగింది. పైగా ఇరుగుపొరుగులు వీళ్ళ మధ్యగల దూరాన్ని పసికట్టి మరికొంచెం సమిధలు ఎగదొయ్యడం మొదలెట్టారు.

ఇద్దరిమధ్య సఖ్యత ఆమడదూరంలో ఉన్నా, సృష్టివైచిత్ర్యం కాకుంటే శాంత ఏడాది తిరగ్గానే పనసపండులాంటి బిడ్డను కనగలిగేదా? పుత్రోత్సాహం వాళ్ళను ఎన్నాళ్ళో కలిపి ఉంచలేకపోయింది. వాడికి ఆరునెలలు నిండకమునుపే వెనుకటి కలతలు, మనస్పర్ధలు మళ్ళీ తలెత్తాయి.

శాంత నైలక్సు చీర కావాలని పేచీ పెట్టి ఉంటుంది. జీతంలో మూడోవంతు కోతలు పోను, ఇంటి అద్దె, పిల్లవాడి పాలు పై ఖర్చులతో నెల సరిగ్గా నడపలేక సతమతమవుతున్న నరసింహం తను ఆ చీర తేలేనని స్పష్టంగా చెప్పి ఉంటాడు. ఉంటాడేమిటి, చెప్పాడు. దాంతో శాంత వంటా గింటా మాని, అలిగి అలక గృహం అలంకరించింది. నరసింహం భార్యకు మెల్లగా నచ్చచెప్పాడు. జి.పి.ఎఫ్.లోనో, సి.డి.ఎస్. డబ్బో రాగానే చీర తెస్తానని. శాంతకు ఈ ప్రస్తావన నచ్చలేదు.

తనంటే ఆ పూట భోజనం లేకపోయినా తట్టుకోగలదు. కాని, ఆరునెలల బాబు ఆకలితో అలమటించుతూ ఏడుస్తుంటే నరసింహం సహించలేకపోయాడు. సామ దాన భేదోపాయాలు పని చెయ్యలేదు. దండోపాయం అతనికి సమ్మతం కాదు.

అందువలన "రోజు రోజుకి నీ ఆగడాలు మితిమీరిపోతున్నాయి. అలకా గిలకామాని బాబుకి పాలుపొయ్యి" అన్నాడు.

"నాచేత కాదు. వాడండే మీ కంత ఆపేక్ష ఉంటే మీరే పోసుకోండి. చీర తెస్తేనే కాని నేను లేచేది లేదు." శాంత మూర్ఖంగా జవాబు చెప్పింది.

"శాంతా! నేను ఎంత శాంతంగా పోవాలనుకుంటున్నా నీకు లక్ష్యంలేదు. చీరకొనడం నాచేత కాని పని. ఇంక నేను ఏమాత్రం సహించలేను. ఇప్పుడే వెళ్ళి సముద్రంలో దూకి ఆత్మహత్య చేసుకుంటాను అంతేకాని ఈ కొంపలో తిరిగి అడుగుపెట్టను" అని విసురుగా వెళ్ళిపోయాడు.

శాంత ఈ హఠాత్పరిణామానికి ఆశ్చర్యపడుతుంది. నరసింహంలో ఇంత తెగింపు ఉంటుందని ఆమె భావించి ఉండదు. నరసింహం అంత కోపంతో ఇంటిలోనుంచి వెళ్ళిపోయాడు.

ఆ తరువాత....

★ ★ ★

ఆ తరువాత సంగతి నాకు అర్థం కాలేదు. ఇంతవరకు రాసిన ఈ కథ నాకు చప్పగా తోచింది. ఒక సస్పెన్సు లేదు. ఒక మంచి ముగింపు లేదు. నాకు రాధమీద చెప్పలేనంత కోపం వచ్చింది. రాధమాత్రం నిశ్చింతగా నిద్రపోతోంది. బయట వర్షం ఏకధాటిగా కురుస్తోంది. ఇలాగే మరికొన్ని గంటలు వర్షం కురిస్తే ప్రళయం సంభవించినట్లే.

వారిద్దరూ ఎందుకు తగువులాడుకున్నారు? చీర కోసమా?

కావచ్చు.

అయితే మాత్రం బాబూరావు అంత ఘోరప్రతిజ్ఞ ఎందుకు చేసి ఉంటాడు. నిజంగా బాబూరావు అన్నంత పని చేస్తే నళిని సంసారం ఏం కావలసింది. ముక్కుపచ్చలారని బాబు బ్రతుకేం కావాలి నళిని?

ఏవీ... వీటికి జవాబులేవి?

ఈ ప్రశ్నలకు సమాధానాలు దొరికితేనే కాని కథ పూర్తి కాదు. రాధ సహకారం లేనిదే నేను ఈ కథను ఎలా పూర్తి చెయ్యగలను?

ఈజీచెయిరులో చేరబడి ఆలోచించసాగాను. నా బుర్ర పనిచెయ్యడం మానేసింది. సిగరెట్టు పెట్టి తెరిచాను. నా బుర్రలో ఆలోచనల లాగే అది శూన్యమైంది. సిగరెట్టు కాలిస్తే కాని ఆలోచనలు ముందుకు సాగవు. మెల్లగా లేచి బట్టలు వేసుకున్నాను. తలుపులు తీశాను. ఉద్ధృతంగా వర్షం కురుస్తున్నది. కథ రాసే ప్రయత్నం విరమించి విశ్రమిస్తే బాగుండుననిపించింది. ఉహు మనస్సు ఒప్పుకోలేదు. రవి కాంచని చోటు కవి కాంచగలడంటారు. ఈ కథ కో మలుపు కల్పించకపోతే రచయితనని చెప్పుకోవడం నాకు సిగ్గుచేటు. కుక్కపిల్లా, సబ్బుబిళ్ళా కూడా కవిత్వానికి అర్హం అని కవులు దండోరా వేస్తున్న ఈ రోజుల్లో బాబూరావు ఆత్మహత్యను ఆధారంగా చేసుకొని కథ రాయలేకపోతే నేను అప్రయోజకుణ్ణి. అప్రయోజకుణ్ణి అన్నమాట తలపుకి రాగానే నాలో అణువణువు దహించుకుపోయింది. కథ పూర్తి చెయ్యాలన్న సంకల్పం బలపడింది.

గొడుగు తీసుకుని, తలుపులు చేరవేసి బయట పడ్డాను, ఇంధనం కోసం. సిగరెట్టు పాకెట్టు తీసుకుని తిరిగి వస్తూంటే ఎదురింటి సుబ్బారావు కిటికీ బయటకు చూస్తూ పలకరించాడు.

"రండి, మాస్టారూ! చాలా ముఖ్యమైన విషయముంది"

ఇంటి తలుపులు చేరవేసి వచ్చాను. వేగంగా పోవాలి అనుకున్న నేను అతడు ఏదో ముఖ్య విషయం అనడంతో అతని గదిలోకి వెళ్ళాను. సుబ్బారావు బ్రహ్మచారి. నా ఆగిపోయిన కథకు మరికొంత

ముడిసరుకు సరఫరా చేశాడు.

"పాపం! ఈరోజు రెండు చావులు. రేపు ఉదయం పేపర్లో మీరు రెండు చావుల వైనం చూస్తారు" అన్నాడు. విషయం సూటిగా చెప్పడం అతడికి చేతకాదో, లేక సస్పెన్సు సృష్టించాలనుకుంటాడో – అతడు ఎవరితో మాట్లాడినా ఇదే ధోరణి.

"నీ కేమైనా జ్యోతిషం వచ్చా?" అన్నాను. అతడు జవాబు ఇవ్వకముందే "చావు వార్తలు లేని పేపర్లున్నాయా?" అన్నాను నాలో ఉత్కంఠను కనపరచకుండా.

"అదికాదు, మాష్టారూ! మీ లోగిట్లో ఉంటున్న బాబూరావు ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు ప్రకటించి ఇంట్లోంచి వెళ్ళిపోయాడు. నళిని కూడా చస్తే ఈ భూమ్మీద ఒక్క క్షణం బ్రతకనంటూ తన నిర్ణయం తెలియజేసింది. మరేం ఈ రెండుచావులు మీ లోగిట్లోనే. అందుకే నాకు నిద్ర రావటంలేదు. ఎవరితో చెప్దామా అని గంటన్నరై కళ్ళు కాయలు కాచిపోయేలా చూస్తున్నాను. ఇదీ విషయం" అన్నాడు.

సుబ్బారావుకి విషయాలు బాగా తెలిసినట్లు ఉన్నాయి. నా కథకు కావలసినంత ఆహారం అతని దగ్గర ఉన్నట్టు అనిపించింది. తలుపు వేసి రాలేదు, త్వరగా పోవాలి అని మొదట్లో అనుకున్న నేను ఆ తలపు మరిచిపోయి అతని దగ్గిర కూర్చున్నాను, అతను చెప్పింది వింటూ.

★ ★ ★

"కట్టుకున్న పెళ్ళానికి మల్లెపూలు – చీరెలు కూడా తేవడం బరువైతే ఎందుకు చేసుకున్నారు పెళ్ళి? పువ్వులైనా, చీరలైనా నాకోసం అడుగుతున్నానేమిటి? మీరు తెచ్చిన చీర కట్టుకుని, మీరు ఇచ్చిన పువ్వులు ముడుచుకుంటే చూసి ఆనందించేది మీరేగా?" అంది శాంత.

"శాంతా! నీకు చీరెలు లేవా? డజనుపైగానే ఉన్నాయే? నువ్వు అడుగుతున్న చీర ఖరీదెంతో తెలుసా? ఎనభైరూపాయలు. ఆమాత్రం డబ్బే ఉంటే గతనెల ఇంటిఅద్దె తీర్చేయగలం. నా మాట విని అనవసరమైన ఈ ఖర్చులు తగ్గించు. బాబు రోజురోజుకి ఎదుగుతున్నాడు. ధరవరలు రోజు రోజుకి మండిపోతున్నాయి. ఎప్పుడేం అవసరం వస్తుందో చెప్పలేము. ఎందుకైనా ముందుచూపు అవసరం." నరసింహం సర్ది చెప్పాడు.

"ఎన్ని చీరెలున్నాయి? డజనున్నాయా? అవి ఎక్కువంటారా? అందులో ఆరు మావాళ్ళిచ్చినవే. నాలుగు చీరెలు బొత్తిగా రంగు మాసిపోయాయి. పొరుగింటి రామలక్ష్మిని చూడండి – పూట కొక్క చీర లెక్కన రోజుకి మూడు చీరెలు కడుతుంది. ఆ వెంకటరత్నాన్ని చూడండి. అదృష్టమంటే దానిది. దాని మొగుడు టూరుమీద వెళ్ళినప్పుడల్లా ఖరీదైన చీర కొని తెస్తాడు. నాకూ ఉన్నాయి. ముష్టి మూడు చీరెలు. అవే మీ దృష్టికి అపరిమితం. ఆ మాత్రం పెళ్ళానికి ఒక చీర కొనలేని మీరు పెళ్ళిచేసుకోకుండా ఉండవలసింది. ఇంతకూ మిమ్మల్ని అని ఏం ప్రయోజనం. నా రాత! డిగ్రీ ఉందని మీకు కట్టబెట్టారు. పెళ్ళన్నప్పుడు ఆస్తిపాస్తులు – ఉద్యోగంలో పై రాబడి ఏమైనా ఉందా అన్న ఆలోచనా పాలోచనా లేకుండా నా మెడలో పుస్తె కట్టించారు" అంటూ శాంత గునిగుని రాగాలు తీసింది.

"శాంతా! ఇప్పుడు నీకేమైంది లోటు? మూడుపూటలా తినడంలేదా? బట్టలు కట్టుకోవడంలేదా? ఒకళ్ళతో మనకు పోలిక దేనికి?"

"తినడేం – తింటున్నాం. పంచభక్ష్య పరమాన్నాలు. తెలకపిండి గుండా, తోటకూర కూరా

– ఇదేనా తిండి. ఇంకా ఇంటింటా తిరిపమెత్తుకునే ముష్టివాడు నయం. నాలుగురకాల వంటకాలు తింటాడు. తిరగడానికెళ్ళినా ఇదే చీర. ఇంట్లో కట్టుకున్నా ఇదే చీర. మన బ్రతుకే ఓ మహారాజు బ్రతకనుకుంటున్నారా? నన్నూ అలాగే అనుకోమంటారా? ఆ రామలక్ష్మి వాళ్ళను చూసి రండి. ఏం తింటున్నారో, ఏం కట్టుకుంటున్నారో మీకే తెలిసివస్తుంది. అయినా మీతో నాకు వాదమెందుకు– మీరు చీర తెస్తే సరేసరి. లేకపోతే నేనీ ఇంటిలో ఒక్క క్షణం ఉండను. ఇంకా నయం – మావాళ్ళు ఈమాత్రమైనా చదువు చెప్పించారు. ఎక్కడ ఆయాగా కుదిరినా నాలుగు చీరలు కొనుక్కోగలను. ఇక్కడ మీకు ఉట్టినే వండిపెట్టే కన్నా ఏ ఇంటిలో వండిపెట్టినా తిండితో పాటు నాలుగు రాళ్ళు దొరక్కపోవు."

"అంటే నీ ఉద్దేశం విడిపోయి వేరే ఉంటాననేగా? చాలా గొప్పగా చెప్పావు. మగాడి అండలేని ఆడది ఎన్ని ఇక్కట్లు పడుతుందో త్వరలోనే తెలుసుకుంటావు. లేకపోయినా నీకు సంతృప్తి లేదు. ఎంతసేపూ ఆ రామలక్ష్మిని తలచుకోకపోతే, ఆ రాధనో, ఆ నీలవేణినో ఎందుకు తలచుకోవు? వాళ్ళు ఎంత అణకువగా ఉంటారు. నీలాగా చీరలంటూ సాధిస్తున్నారా? వాళ్ళలా ఉన్నంతలో సర్దుకుపోవడం నేర్చుకోవాలి."

"ఏం–మగాడి దిక్కులేకపోతే ఆడది బ్రతకలేదా? ఎవరా అన్నది. మీలాంటి మగవాడే స్త్రీజాతి మీద అసూయతో అనిఉంటాడు. అది మీకు వేదవాక్కులా,రామబాణంలా పనికొస్తున్నది. రోజులు మారి పోయాయండి. ఇది సీత, అనసూయల కాలం కాదు – మీ ఆటలు సాగడానికి. ఆడవాళ్ళు ఎంత పెద్దపెద్ద పదవుల్లోఉన్నారో గుర్తు తెచ్చుకోండి. ఎంతో దూరం ఎందుకు? మీ పై అధికారి స్త్రీ కాదా?"

"కాదనలేదు. కాని మొగుణ్ణి కాదని పోలేదే. గుట్టుగా కాపురం చేసుకుంటున్నది. నీలా బరితెగించి ఊళ్ళేలుతా ననడంలేదు."

"నేను ఊళ్ళేలతా ననడం లేదు. ఎంత అక్కసండి. ముచ్చటపడి అడిగిన చీర మొగుడు తెచ్చే స్థితిలో లేడు – అందుచేత ఉద్యోగం చేసి నా సంపాదనతో చీరెలు కొనుక్కుంటా నంటున్నానంతే. అది కూడా మీకు కిట్టటంలేదు."

"అలాగన్నా బాగుండేది. నిక్షేపంలా ఒక ఉద్యోగం చూసి పెడతాను. నీ జీతం కూడా కలిస్తే వేడినీళ్ళకు చన్నీళ్ళలాగ మన సంసారం బాగుపడుతుంది. అబ్బాయిని ఏ కాన్వెంటులోనైనా చదివించనూ వచ్చు."

"అమ్మో! ఎంత ఆశండి! ఆడదాని సొమ్ము అంత అలుసా? ఇంతకీ ఈ వాదనంతా ఎందుకు? చీర మాట ఏమిటి? అది ముందు తేల్చండి. లేకపోతే...."

"లేకపోతే?"

"ఒక్కపూట కూడా వండిపెట్టను. హాయిగా మీరే వండుకు తినండి" అంటూ నిరాహారదీక్ష వార్నింగు ఇచ్చింది శాంత.

"బాగుంది నీ ప్రతిజ్ఞ. అయితే, విను. నాకూ ఈ సంసారంతో మొహం మొత్తేసింది. సముద్రంలో దూకి చస్తాను. అంతేకాని, ఈ కొంపలో తిరిగి అడుగుపెడితే ఒట్టు. నిక్షేపంలా ఉద్యోగం చేసి, చీరలు కొనుక్కుని ఊరేగు. పూటకొక్కటి కాదు, గడియకొక్కటి గట్టుకో. నీకేనా పౌరుషం ఉంది..." అంటూ ఉగ్రనరసింహంలా లేచాడు నరసింహం.

శాంత తుళ్ళిపడింది. "ఏమండి - ఏమిటా కోపం? శాంతించండి" అంది గాబరాగా.

"నాకు కోపం రాదు. వస్తే నేను మనిషిని కాను. ఇన్నాళ్ళు నన్ను కాల్చుకు తిన్నది చాలు. ఇంక నన్నాపడం నీ తరం కాదు" ఖచ్చితంగా తన ఉద్దేశాన్ని పునరుద్ఘాటించాడు.

శాంతకు ఈ పర్యాయం మతిపోయింది. కోపంతో ఊగిపోయింది. భర్త ఇంత తెగువ చేస్తాడనుకోలేదు. "మీ దారి మీరు చూసుకుంటే నేనేనా తక్కువ తిన్నది. మీరు ఇలా వెళ్ళగానే నేను కిరసనాయిలు పోసుకుని చస్తాను. అప్పటికి మీ మనస్సు శాంతిస్తుంది. కట్టుకున్న పెళ్ళాం నూరేళ్ళ జీవితంలో నిప్పులు పోద్దాం అనుకుంటే నేను మాత్రం సాధించలేననుకున్నారా?" అంది.

అంతవరకు చిలికిచిలికి గాలివాన పెనుతుఫానుకు దారితీసింది.

★ ★ ★

"అయితే, మాష్టారూ! బాబూరావు చచ్చిపోయి ఉంటాడా? నళిని కిరసనాయిలుతో అంటించుకుని దహనమైపోయి ఉంటుందా? అన్నట్టు, మాష్టారూ? నళిని సాయంత్రం అయిదు లీటర్లు కిరసనాయిలు కొనడం నా కళ్ళారా చూశాను" అన్నాడు సుబ్బారావు.

"చెప్పలేం సుబ్బారావూ! కొంతమంది అన్నంత పని చేస్తారు. బాబూరావు అంత మెత్తగా ఉంటాడా? మాటంటే మాటే అతనికి. ఇలాంటివాళ్ళలో తెగింపు, తెగువ ఒక పాలు ఎక్కువే ఉంటుంది. జీవనపోరాటంలో విసుగెత్తి జీవితంపై రోత కలిగితే ఆత్మహత్య చేసుకోవడమే గత్యంతరం. అదే జీవన న్యాయం. బాబురావుకి పరిస్థితులతో పోరాడే ఓపిక నశించింది. ఈ రోజుతో అతడి ఆయుర్దాయం తీరింది. ఇంతకీ ఆ చీర తెచ్చిందీ ప్రళయం" అన్నాను.

"చీరంటే గుర్తుకొచ్చింది. మీరు రాధగారికోసం కొన్న చీర చూసి మురిసిపోయి అలాంటి చీరే తనకూ కావాలని పట్టుపట్టింది నళిని."

నాకు కడుపులో దేవేసింది. నేను నా రాధకోసం రాధ పుట్టినరోజు కానుకగా తెచ్చిన చీర ఇంతటి అఘాయిత్యానికి కారణభూతమైందా? మరి అక్కడ ఉండలేకపోయాను.

★ ★ ★

ఏది న్యాయం - ఏది అన్యాయం? నా భార్యకోసం నేను చీర కొనడం అన్యాయమా?

అలాంటిదే తనకూ ఒక చీర కావాలని శాంత పట్టుబట్టడం అన్యాయమా?

నాచేత కాదు అని నరసింహం కొట్టి పారేయడం అన్యాయమా?

నరసింహం చస్తానని బెదిరించడం న్యాయమా?

శాంత ప్రతీకారంగా తనూ ప్రాణత్యాగం చేస్తాననడం న్యాయమా?

ఈ కథను రాయాలని నేను తలపోయడం న్యాయమా?

ఏది న్యాయం!

ఇందులో పొరపాటు ఎక్కడుంది?

రెండు ఘోరమైన చావులు. మధ్య ముక్కుపచ్చలారని బాలుడు నలిగిపోయాడు. ఉన్నతమైన భవిష్యత్తు మొగ్గగా ఉన్నప్పుడే నలిపివేయబడింది. ఇలాంటి పరిస్థితుల్లో ఆ బాలుడి జీవితం ఏమవుతుంది? బాబుని ఎవరాదుకుంటారు? ముష్టెత్తుకొని తిరుగుతాడా? ఏ దొంగలనాయకుడో వీడిని

చేజిక్కించుకుని దొంగతనాలు నేర్పుతాడా?

అవి నా కథకు అప్రస్తుతాలు. అంత ముందుకి నేను పోదలచుకోలేదు. ఈ కథలో ముఖ్యంగా నేను చెప్పవలసిన నగ్నసత్యం మనిషికి కావలసింది సంతృప్తి. ఉన్నంతలో తిని, కలిగినంతలో ఆనందంగా జీవించడమే జీవన న్యాయం. శాంతవంటి అసూయాపరులు జీవితాన్ని కంటకావృతం చేసుకుంటారు. పచ్చనిసంసారంలో చిచ్చు నింపుకుంటారు. పర్యవసానం ఆత్మహత్యలు. చచ్చి సాధిస్తామనుకుంటారు. కథ పూర్తి చేశాను. కథలో ముఖ్యపాత్రల పేర్లు మాత్రం మార్చాను. తక్కినదంతా యథాతథంగా జరిగిన సంఘటనలే (నేను విన్నవి) రాశాను. నా గుండె బరువెక్కింది.

బాబు జీవితం ఎలా గడుస్తుంది అన్న ఆదుర్దా!

నేను తెచ్చిన చీర ఎంతటి పర్యవసానానికి మూలమైంది అన్న వ్యథ!

నళిని వంటి స్వభావం కల స్త్రీలు ఎంతటి విపరీతాలు కలుగజేస్తారు అన్న మథన.

బాబూరావు ఎంతగా జీవితంతో వోడిపోతే ఇంతటి దౌర్భాగ్యపు చావు చస్తాడు అన్న ఆవేదన.

ఆ రాత్రి నన్ను నిద్రకు దూరం చేసింది. రాత్రల్లా ఉద్ధృతంగా వర్షం కురుస్తూనే ఉంది. తెల్లవారుజామున ఎప్పుడు నిద్ర పట్టిందో కాని కళ్ళు తెరువగానే నా కళ్ళముందు ఆరోజు పేపరు కనిపించింది. రాత్రి కురిసిన వాన జాడలేదు. ఎప్పుడు వాన వెలిసిందో నాకు గుర్తులేదు ఇప్పుడు మాత్రం సూర్యుడి తీక్షణ కిరణాలు నా పక్కమీద ఏటవాలుగా పడుతున్నాయి.

గభాలున లేచి పేపరందుకున్నాను. మొదటి పేజీలో ఏ వార్తాలేదు. అంటే పేపర్లో ఏ వార్తలు లేవని కాదు. సుబ్బారావు ఆశించిన (నేను కూడా ఊహించిన) రెండుచావులవార్త లేదని నా భావం. చివరిపేజీ తిరిగేశాను. అందులోనూ ఏ సమాచారం లేదు. (అంటే డిటో) తక్కిన పేజీల్లో కోలం కోలం చూశాను. అయినా నా దృష్టికి గతదినం జరిగిన ఆత్మహత్యల వైనంలేదు.

అంటే బాబూరావు శవం ఇంకా పోలీసులకు దొరికి ఉండదు. నళిని ఏ అర్ధరాత్రో చచ్చిపోయి ఉంటుంది. ఈ వార్త ఇంకా పత్రికల రిపోర్టర్స్ చెవినపడి ఉండదు.

"ఏమండోయ్! ముఖమైనా కడుక్కోకుండా అప్పుడే పేపర్లో మునిగిపోయారా? త్వరగా రండి, కాఫీ చల్లారిపోతోంది." వంటింట్లోంచి రాధ గొంతు.

"ఏమిటి, రాధ ఇంట్లోనే ఉన్నదా? నళిని ఇంటికి వెళ్ళలేదా? ఆమె చావు గురించి పొరుగున ఉంటున్న రాధకు ఇంకా తెలియలేదా?"

"రాధా! నళిని ఇంటికి వెళ్ళలేదా?" అన్నాను.

"ఎందుకు?"

"మరేం! నళిని ఆత్మహత్య చేసుకుంటానని ప్రతిజ్ఞ చేసిందట. కిరసనాయిలు కూడా కొన్నది. బాబూరావు సంగతి నువ్వు చెప్పనే చెప్పావు."

రాధ పక పక నవ్వింది.

"బాగుందండి మీ ప్రశ్న. భర్తమీద కోపం వస్తే భార్య, భార్యమీద అలిగి భర్త ఆత్మహత్యలు చేసుకుంటారటండీ? ఎంత అమాయకంగా ఊహించారండి!"

"అంటే అది ఉత్తుత్తి కోపమేనా?"

"కాకపోతే వడ్లగింజలో బియ్యంగింజ. ఇలాగైతే ఇప్పటికెందరు భార్యాభర్తలు రోజూ చస్తూ ఉండాలో? కోపంలో మాటా మాటా అనుకుంటారు. మళ్ళీ మరుక్షణంలో కలిసిపోతారు, క్షీరనీర న్యాయంలా! ఈ మాటలకేంగాని, త్వరగా ముఖం కడుక్కోండి - కాఫీ చల్లారిపోతోంది."

"అయితే అలిగి వెళ్ళిపోయిన బాబూరావు ఇంటికొచ్చాడా?"

"ఆహా! నిక్షేపంలా! వర్షం వెలవగానే భార్య కోరిన చీర తీసుకుని మరీ వచ్చాడు. అప్పటికి నళిని కూడా ఏవేవో పిండివంటలు చేసి భర్తకోసం కాచుకుని కూర్చుంది."

"మొత్తానికి కథ అడ్డం తిరిగిందే, ఇదెక్కడి న్యాయం?"

"ఇదేనండి జీవన న్యాయం. ఇంకా నయం. మీరు రాత్రంతా పరిశ్రమించి రాసిన రెండు చావుల కథను పత్రికకు పంపబోకండి. నలుగురూ నవ్విపోతారు. ఇలాంటి చెత్తసరుకుతో ఉన్న పేరు కూడా పోతుంది."

**(ఆంధ్రప్రభ - సచిత్ర వారపత్రిక - 17.8.1977)**